క్లుప్తంగా

బస్సు నడపాలని మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని గాజులపెళ్లూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని మహిళలు కోరారు. వారు బుధవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గతంలో గ్రామంలోకి ఆర్టీసీ బస్సు వచ్చేదని తెలిపారు. ఇప్పుడు బస్సులు గ్రామంలోకి రాకుండా సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డులో వెళుతున్నాయని వాపోయారు. సూళ్లూరుపేట రోడ్డు నుంచి గ్రామంలోకి రావాలంటే రెండు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు నడపాలని మహిళలు కోరారు.

వీధి దీపాలకు మరమ్మతులు



వీధి లైట్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పీవీకండ్రిగ, ఏపార్లపల్లి, కృష్ణాపురం గ్రామాల్లోని వీధి లైట్లకు సర్పంచ్ కోటమ్మ, వైఎస్సార్‌సీపీ వడ్డెర సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ప్రసాద్‌పాల్ మరమ్మతులు చేపట్టారు. వెలగని వీధిలైట్లను తొలగించి, కొత్త వాటిని అమర్చారు. వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టటంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు



కోడి పందెంరాయుళ్లతో కానిస్టేబుళ్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి, తిమ్మభూపాలపురం గ్రామాల సమీపంలో బుధవారం కోడి పందేలు ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి నాలుగు కోళ్లు, రూ.3400 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు పేర్కొన్నారు. మండలంలో కోడి పందేలు ఆడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కానిస్టేబుళ్లు ప్రభాకర్, అరుణ్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం




ఎంజీఆర్‌కు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురం హరిజనవాడలో బుధవారం సినీ నటుడు ఎంజీఆర్ జయంతి సందర్భంగా నాగలాపురం వెస్టు హరిజనవాడకు చెందిన పి.రాజ, చెన్నైకి చెందిన జానకిరామన్ (ఇంజినీర్) పేదలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. అనంతరం ఎంజీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్రన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

ఏర్పేడు : విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఈ నెల 19న జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ కోరారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా 206 అడుగుల ఎత్తుతో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారని తెలిపారు. బహుజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చారిత్రాత్మకం



కె.జయచంద్ర నాయుడు

పిచ్చాటూరు : విజయవాడలో 206 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం చారిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు తెలిపారు. ఆయన బుధవారం తన స్వగ్రామం గోవర్ధనగిరిలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడుస్తూ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కృష్ణా జిల్లాకు కుల, మతాలకు అతీతంగా ఎన్టీఆర్ పేరు పెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణదేవరాయలుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకృష్ణదేవరాయల జయంతిని బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని సుపథ మండపం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు మూడుకార్లు పంటలు పండించుకునేలా శ్రీకృష్ణదేవరాయలు సుమారు 80 చెరువులను తవ్వించారని పేర్కొన్నారు. రాజగోపురం వద్ద త్వరలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. శ్రీకాళహస్వీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ తన రాజసానికి చిహ్నంగా శ్రీకాళహస్తిలో రాజగోపురం నిర్మించడం శ్రీకృష్ణదేవరాయలకే చెల్లిందన్నారు. నవయుగ కన్స్ట్రక్షన్ వారు త్వరలో 580 కేజీల శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని అందజేస్తున్నట్టు తెలిపారు. త్వరలో రాజగోపురం ముందు దానిని ప్రతిష్టిస్తామన్నారు. పాలక మండలి మాజీ చైర్మన్ కోలా ఆనంద్, కాపు సంఘం నాయకులు పూల కృష్ణమూర్తి, ఉప్పు కృష్ణయ్య, మందల సుబ్రమణ్యం, కొట్టే సత్యం, మందల బాలాజీ, పగడాల రాజు, పత్తి మణి, మున్నా రాయల్, జయశ్యామ్ రాయల్, చింతామణి పాండు, సెన్నీకుప్పం శేఖర్, గణేష్, కంతా ఉదయ్ పాల్గొన్నారు.

ఏర్పేడులో...

ఏర్పేడు: స్థానిక గుంటకట్ట సమీపంలో బుధవారం శ్రీకృష్ణ దేవరాయల జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు.

కొండచుట్టు ఉత్సవానికి తరలిన దేవతలు



సర్వభూపాల వాహనంలో పరాశరేశ్వరస్వామి



పాలీశ్వరస్వామి

నారాయణవనం: సంక్రాంతి పండుగ సందర్భంగా నగరిలో బుధవారం కొండచుట్టు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో నారాయణవనం మండలంలోని శివక్షేత్రాల నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి, మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం వేకువజామునే నిత్యపూజలు చేశారు. ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులు సముదాయంలోని అరుణానదిలో సందిపు ఉత్సవంలో పాల్గొని నగరికి బయలుదేరారు. సముదాయం గ్రామానికి చెందిన రైతులు తమ ఆవులను అలంకరించి ఉత్సవర్లకు ఎదురుగా పరుగెత్తించారు. ఊరేగింపు నారాయణవనం కోట వీధులు, కీళగరం, గోవిందప్పనాయుడుకండ్రిగ మీదుగా తుంబూరు చేరుకుంది. అప్పటికే పాలమంగళం పాలీశ్వరస్వామి, తుంబూరులోని తుంబీశ్వరస్వామి సందింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు ఆలయాల ఉత్సవర్లు పాలమంగళం, ఎలకాటూరు, ఆరూరు, బుగ్గఅగ్రహారాల మీదుగా సాయంత్రానికి నగరిలో జరిగే కొండచుట్టు ఉత్సవంలో కొలువుదీరారు. అనంతరం ఉత్సవమూర్తులు నగరి నుంచి అర్ధరాత్రి దాటాక ఆలయాలకు చేరుకున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాదమరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని వేపనపల్లెలో బుధవారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఉచితంగా 14 రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి దీర్ఘకాలిక వ్యాధులకు నెలకు సరిపడా మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత, మహిళ ఆరోగ్య కార్యకర్త ప్రియాకుమారి, ఆశ కార్యకర్తలు రమీల, భువనేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చేతికందేంత ఎత్తులో విద్యుత్ తీగలు



నిరసన తెలుపుతున్న గిరిజనులు



కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

వరదయ్యపాళెం: మండలంలోని కళత్తూరు గిరిజన కాలనీలో విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులో ఉన్నాయి. దీంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. వాటిని సరిచేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తాము ఊరికి దూరంగా పంట పొలాల మధ్య జీవనం సాగిస్తున్నామని, ఏదైనా జరిగితే ఎవరు కాపాడతారని వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

ఈఏపీ రోడ్లకు నిధుల మంజూరెన్నడో..?

- అర్ధంతరంగా గ్రామీణ రోడ్లు
- పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం



అర్ధంతరంగా ఆగిన బీఎస్‌పేట రోడ్డు పనులు

వరదయ్యపాళెం: కేంద్ర ప్రభుత్వం కమ్యూనిటీ గ్రామీణ అభివృద్ధి శాఖ(పీఐయూ) ఆధ్వర్యంలో ఈఏపీ ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్ (ఈఏపీ) పథకాన్ని అమలుచేస్తోంది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మూడేళ్ల క్రితం వరదయ్యపాళెం మండలంలోని కురింజల్లం, వడ్డిపాళెం, బీఎస్‌పేట, ముస్లింపాళెం, లక్ష్మీపురం, కోవూరుపాడు, గోపాలరావుకాలనీ, రామిరెడ్డిపాళెం గ్రామాల రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.3 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ రెండున్నరేళ్ల క్రితం ఆయా రోడ్లలో కల్వర్టులు నిర్మించి కొంతమేర మట్టి పనులు చేపట్టారు. బిల్లులు మంజూరుకాకపోవడంతో పనులను ఆపేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లలో గుంతలు పడి నీరు నిలవడంతో నడిచేందుకు కూడా వీలుకాక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. స్థానికులు ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లి రోడ్లను బాగు చేయాలని కోరారు. అంతేగాక గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు సైతం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్ల పనుల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించి నిధులు మంజూరు చేయించాలని కోరారు. అయినా ఇప్పటి వరకు నిధులు మంజూరుకాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బియ్యపు శ్రీవాణిరెడ్డికి అయోధ్య అక్షింతలు



శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డికి బుధవారం ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు మంగిరెడ్డి, సురేష్ అయోధ్య శ్రీరాముల వారి అక్షింతలు అందజేశారు. వాటిని పూజలో పెట్టి అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట రోజున చల్లుకోవాలని తెలిపారు. ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యాన్నదాన సత్రం పరిశీలన



భక్తులతో మాట్లాడుతున్న ఈవో కేఎస్ రామారావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రాన్ని బుధవారం ఈవో కేఎస్ రామారావు పరిశీలించారు. కూరగాయలు, బియ్యం, సరుకుల గురించి సిబ్బందిని ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. అనంతరం భోజనం నాణ్యతపై భక్తులను అడిగి తెలుసుకున్నారు.

హెల్మెట్ ధరించండి



మాట్లాడుతున్న డాక్టర్ జీపీ చంద్రన్

సత్యవేడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డాక్టర్ జీపీ చంద్రన్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో బుధవారం రోడ్ సేఫ్టీ మాసోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని అతివేగంగా వాహనాలను నడపవద్దన్నారు. సెల్ ఫోన్లు నడుపుతూ వాహనం నడపరాదన్నారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమనే నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. డీఎం వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు మృతి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడు కండ్రిగ పంచాయతీ కేవీమిట్టకు చెందిన పోలయ్య(75) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం విషపు ఆకు తిని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఆయనను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

రికార్డుల తనిఖీ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం పలు విభాగాలకు చెందిన రికార్డులను ఈవో కేఎస్ రామారావు తనిఖీ చేశారు. ఆలయంలోని పీఆర్వో కార్యాలయం, ఇంజనీరింగ్ విభాగం ఇతర ప్రధాన కార్యాలయాల్లోని విభాగాలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఎమ్మెల్యే, ఎంపీని కలిసిన నాయకులు



ఎంపీ గురుమూర్తిని గజమాలతో సత్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీలు

కేవీబీపురం : సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి ఎంపీ గురుమూర్తిని బుధవారం కేవీ బీపురం జెడ్పీటీసీ మునెమ్మ, ఎంపీటీసీలు, సుమారు 200 మంది కార్యకర్తలు కలిశారు. గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మునెమ్మ, సుబ్బన్న మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరుపతి ఎంపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి గురుమూర్తిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ మేరకు మండలంలోని కార్యకర్తలతో కలిసి సమష్టిగా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గురుమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి త్వరలోనే సత్యవేడు నియోజకవర్గంలో పర్యటిస్తానని తెలిపారు. ఆరె సచివాలయ కన్వీనర్ మునిరత్నం, నేతలు మునస్వామి, దాము, నరసయ్య, గోవింద్‌స్వామి, ధన్‌రాజ్, మహేష్, వెంకటేష్, మునివేలు, సుధా తదితరులు పాల్గొన్నారు.

గురుమూర్తిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం



ఎంపీ గురుమూర్తితో నాగలాపురం సర్పంచులు

నాగలాపురం : సత్యవేడు ఎమ్మెల్యేగా మద్దెల గురుమూర్తిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని నాగలాపురం మండలానికి చెందిన సర్పంచులు, నాయకులు తెలిపారు. వారు బుధవారం సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త గురుమూర్తిని కలిసి సత్కరించారు. కార్యక్రమంలో టి.పి.పాలెం సర్పంచ్ పళని, టి.పి.కోట కో–ఆప్షన్ సభ్యుడు షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆదిమూలంను గజమాలతో సన్మానిస్తున్న నేతలు, కార్యకర్తలు

మాతమ్మకు సారె సమర్పణ



సారె తీసుకువెళుతున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం అరుంధతీవాడ మాతమ్మ ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తుల పిలుపు మేరకు ఆమె ఆలయానికి వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. అలాగే ఎండీపుత్తూరు ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గాలి గుణశేఖర్ నాయుడు, రమేష్, సురేఖ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట



ఆరోగ్య సురక్ష కార్డులు అందజేస్తున్న వయ్యాల కృష్ణారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి మండలం నారాయణపురంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదల ఆరోగ్యం పట్ల అలక్ష్యం వహించాయని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేశారని, ప్రజలకు ఇంటి వద్దే వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తీసుకువచ్చారని వివరించారు. అనంతరం గ్రామీణులకు ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెర్లోపల్లి సచివాలయ కన్వీనర్ మావిళ్లపల్లి వెంకటేష్, పసల కృష్ణయ్య, జే.కృష్ణారెడ్డి, వయ్యాల మనోహర్‌రెడ్డి, వసంతరెడ్డి, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏటి పండుగ



వాలీబాల్ ఆడుతున్న యువత



గొబ్బిళ్లు ఆడుతున్న మహిళలు

నాయుడుపేట: ఏటి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం చిన్నాపెద్దల ఆటపాటలతో స్వర్ణముఖి నదీ తీరం సందడిగా మారింది. ఇంటి నుంచి తినుబండారాలు తెచ్చుకుని అందరూ ఒకే చోట కూర్చుని సంతోషంగా గడిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ఆటలు ఆడారు. గాలిపటాలను ఎగురవేయడంతోపాటు చిన్న పిల్లల కేరింతలతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కే రాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఓ కిషోర్ యాదవ్, పోలేరమ్మ ఆలయ చైర్మన్ సిద్దయ్య, డీ రవి, పీ నాగార్జున, ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏ లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



సత్యవేడు: విజేతగా నిలిచిన పెద్ద ఈటిపాకం సచివాలయం జట్టు

బుచ్చినాయుడుకండ్రిగ : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీవో సాయి లహరి తెలిపారు. ఆమె బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు 190 జట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో త్రివిక్రమ్‌రావు, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో పెద్ద ఈటిపాకం జట్టు సత్తా

సత్యవేడు : ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పెద్ద ఈటిపాకం సచివాలయం యువకులు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. పెద్ద ఈటిపాకం – సత్యవేడు–4 జట్ల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పెద్ద ఈటిపాకం జట్టు క్రీడాకారులు 94 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సత్యవేడు–4 జట్టు క్రీడాకారులు 64 పరుగులకే ఆల్ అవుట్ అయ్యారు. విజేత జట్టుకు సత్యవేడు–4 ఎంపీటీసీ షీలా, ఆమె భర్త రాబిన్ వ్యక్తిగతంగా రూ.516 బహుమతి అందజేశారు. ఈవోపీఆర్డీ మునిరవికుమార్, పీడీలు ఏకే. మురళి, కే.సతీష్, కే.మణి, పయణీబాబు, గ్రేస్ ప్రతిమ, స్వర్ణ, అపర్ణ, ఢిల్లీరాణి పాల్గొన్నారు.

ఆడుదాం– ఆంధ్రా కబడ్డీ విజేత ఇరుగుళం

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో ఇరుగుళం సచివాలయం జట్టు విజయం సాధించింది. ఇరుగుళం జట్టు 12 పాయింట్లు, శిరుణంబూదూరు జట్టు 11 పాయింట్లు సాధించాయి. ఒక పాయింట్ తేడాతో ఇరుగుళం జట్టు విజేతగా నిలిచించి. కెప్టెన్ సాయి కుమార్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఏకే.మురళి, ఢిల్లీరాణి, కే.సతీష్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజేత మన్నముద్రం, బందారుపల్లి జట్టు

ఏర్పేడు : మండలంలోని కుప్పయ్యకండ్రిగలో బుధవారం జరిగిన ఆడుదాం–ఆంధ్రాలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో మన్నసముద్రం, బందారుపల్లి జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో ఇప్పటి వరకు పలు గ్రామాలకు చెందిన 40 జట్లు పాల్గొన్నాయి. బుధవారం బందారుపల్లి సచివాలయ పరిధిలోని బందారుపల్లి, మన్నసముద్రం గ్రామాలకు చెందిన జట్టు చెల్లూరు జట్టుపై 15 పరుగుల తేడాతో విజయం సాధించింది.







బుచ్చినాయుడుకండ్రిగ: బ్యాడ్మింటన్ ఆడుతున్న ఎంపీడీవో, సత్యవేడు: కబడ్డీ విజేత ఇరుగుళం జట్టు, ఏర్పేడు: ఆనందం వ్యక్తం చేస్తున్న విజేతలు